క్లుప్తంగా

ఆత్మీయ అభినందన



వెంకట సుబ్బయ్యను అభినందిస్తున్న ఏయూ వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియమితులైన ఏయూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ ఆచార్యులు కె.వెంకట సుబ్బయ్య మర్యాదపూర్వకంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో భేటీ అయ్యారు. ఆయన కార్యాలయంలో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నూతనంగా వీసీగా నియమితులైన వెంకట సుబ్బయ్యను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అభినందించారు.

క్యాన్సర్ బాధితులకు హెయిర్ డొనేషన్



జుట్టు దానం చేసేందుకు వచ్చిన విద్యార్థినులు

బీచ్‌రోడ్డు: క్యాన్సర్‌తో పోరాటం చేస్తున్న వారికి హెయిర్ డొనేషన్ కార్యక్రమం విజయవంతమైంది. వైజాగ్ లేడీస్ సర్కిల్ 201, వైజాగ్ రౌండ్ టేబుల్ 77 సంయుక్తంగా శనివారం నగరంలోని ఒక హోటల్ నందు హెయిర్ డోనేషన డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ డ్రైవ్‌ను ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ మెడికల్ డైరెక్టర్ సుగంధి ప్రారంభించారు. ఈ సందర్భంగా జుట్టు దానం చేసిన పోలాక్స్ స్కూల్ విద్యార్థులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ లేడీస్ సర్కిల్ 201 చైర్‌పర్సన్ శ్వేతా జోషి, రజనీ, శ్రావ్య కూచిపూడి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలతో కూడిన విద్యనందించాలి



మాట్లాడుతున్న దిశ ఏసీపీ వివేకానంద

బీచ్‌రోడ్డు: సంస్కృతీ సంప్రదాయాలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని దిశ ఏసీపీ సీహెచ్ వివేకానంద అన్నారు. శనివారం ఇస్కాన్‌కు చెందిన డివైన్ టచ్ స్కూల్ 12వ వార్షికోత్సవాన్ని వుడా చిల్డ్రన్ ఎరీనాలో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు రోజులో కొంత సమయం కచ్చితంగా తమ పిల్లలతో గడపాలన్నారు. విద్యార్థులకు విద్య ఎంతో ముఖ్యమో..సంస్కృతీసంప్రదాయాలు, విలువల కూడా అంతే అవసరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ను వివరించారు. ఎవరైన బ్యాడ్ టచ్ చేస్తే తల్లిదండ్రులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ నేహదాస్, న్యాయవాది విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మతసామరస్య వారోత్సవం

మద్దిలపాలెం : ఆదివారం నుంచి ప్రపంచ మతసామరస్య వారోత్సవాలను నిర్వహించనున్నట్టు టీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీస్ ఇంటర్‌నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్, గాంధీ సెంటర్ ప్రతినిధి నరవ ప్రకాశరావు తెలిపారు. కార్యక్రమాన్ని ఉదయం 10.15 గంటలకు డాక్టర్ ఎల్‌బీ కాలేజీ ప్రాంగణంలోని గాంధీసెంటర్ సెమినార్ హాల్‌లో నిర్వహిస్తున్నామన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ కులపతి, గాంధీసెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ పాల్గొంటారని ఆయన తెలిపారు.

కంచె దాటి..మృత్యు ఒడిలోకి..

- జూ పార్కు నుంచి పీఎంపాలెం వరకు ఇనుప కంచె శిథిలం
- దీంతో జనారణ్యంలోకి వన్యప్రాణులు
- వాహనాలకు అడ్డంపడి మృత్యువాత



రెండేళ్ల క్రితం సీతకొండ నుంచి కిందకు దిగి విశాలాక్షినగర్ ప్రాంతంలో మృతి చెందిన కణుజు



జూ సమీపంలో కంబాలకొండ నుంచి రోడ్డుమీదకు వచ్చిన జింక (ఫైల్)

ఆరిలోవ (విశాఖ తూర్పు): అడవుల్లో పచ్చని చెట్ల మధ్య విశాలమైన ప్రదేశంలో హద్దులు లేకుండా చెంగుచెంగున తిరిగే వన్యప్రాణులు జనారణ్యంలోకి చేరి మృత్యువాత పడుతున్నాయి. ఆకలి, దాహం తీర్చుకోవడానికి బయటకు వస్తున్నాయో, వేరే క్రూర మృగాలు వెంటబడితే వాటి నుంచి రక్షించుకోవడానికి ప్రాణ భయంతో బయటకు వస్తున్నాయో తెలియదు కానీ ప్రాణాలు మాత్రం పోతున్నాయి. నగరం నడిబొడ్డున ఉన్న కంబాలకొండ, సీత కొండలు నుంచి వచ్చిన కణుజులు, చుక్కల జింకలు, అడవి పందులు, కొండ మేకలు ఏదో ఓచోట తరుచూ ప్రాణాలు కోల్పోతున్నాయి.

జాతీయరహదారిని ఆనుకొని కంబాలకొండ ఇటు జూ పార్కు నుంచి పీఎంపాలెం వరకు, అటు అడవివరం నుంచి శొంట్యాం వరకు కొన్ని వేల హెక్టార్లలో అటవీ ప్రాంతముంది. మరో వైపు జాతీయరహదారిని ఆనుకొని డెయిరీ ఫారం, విశాలాక్షినగర్ నుంచి జోడుగుళ్లపాలెం, జూ పార్కు వరకు బీచ్‌రోడ్డును ఆనుకొని సీతకొండ ఉంది. ఆయా రెండు కొండలు రిజర్వుడ్ ఫారెస్టుకు చెందినవే. ఇవి దట్టమైన అటవీ ప్రాంతాలు. వాటిలో ఎక్కువ సంఖ్యలో జింకలు, కణుజులు, అడవి పందులు, గొండ మేకలు, తదితర వన్యప్రాణులు సంచరిస్తున్నాయి. చిరుతలు కూడా పదుల సంఖ్యలో తిరుగుతున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. అభయారణ్యమైన కొంబాలకొండలు నుంచి వన్యప్రాణులు బయటకు రాకుండా జాతీయ రహదారిని ఆనుకొని జూ పార్కు నుంచి పీఎం పాలెం వరకు ఇనుప తీగలతో కంచె వేశారు. దాని కింద ట్రంచ్ తవ్వించారు. ఇప్పుడు ఆ కంచె చాలాచోట్ల శిథిలమైంది. సీతకొండకు మాత్రం ఎక్కడా కంచె ఏర్పాటు చేయకుండా వదిలేశారు. దీంతో కంబాలకొండలో కంచె శిథిలమైన ప్రాంతాలు నుంచి జింకలు, కణుజులు జాతీయరహదారిపైకి చేరి భారీ వాహనాలకు అడ్డంపడి ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నాయి. జాతీయ రహదారిపై గడిచిన ఐదేళ్లలో సుమారు పది వరకు జింకలు, అడవి పందులు ప్రమాదాలకు గురయ్యాయి. ఎక్కువగా కంబాలకొండ గేటు, జూ పార్కు, ఏఆర్‌సీ మధ్యలోను, ఎండాడ పెట్రోల్ బంక్ వద్ద వాహనాలకు అడ్డంపడుతున్నాయి. సీతకొండ నుంచి వచ్చిన జింకలు, కనుజులు సముద్రంలో దిగి మృత్యువాత పడుతున్నాయి.

- మూడు రోజుల క్రితం సీతకొండ నుంచి ఓ కణుజు కిందకు దిగి విశాఖవ్యాలీ స్కూల్ సమీపంలో మృతి చెందింది. ఆ కణుజు మృతదేహం కుళ్లిపోవడంతో అటవీశాఖ అధికారులు దహనం చేయించారు. వృద్ధాప్యంతో కొండ పైనుంచి కిందకు జారిపడి మృతి చెంది ఉంటుందని అటవీ అధికారులు భావించారు.
- నెల క్రితం ఓ చుక్కల జింక సీతకొండ నుంచి కిందకు వచ్చి అదే ప్రాంతంలో సముద్రంలో దిగి కెరటాలకు బలైంది. ఇది దాహంతో నీరు తాగడానికి వెళ్లి కెరటాల్లో చిక్కుకుపోయి ఉంటుందని అటవీ అధికారులు భావించారు.
- రెండు నెలల క్రితం కంబాలకొండ నుంచి జనారణ్యంలోకి వచ్చిన ఓ కొండ మేకను డెయిరీ ఫారం సమీపంలో కుక్కలు తరిమి చంపేశాయి.
- రెండేళ్ల క్రితం సీతకొండ నుంచి విశాలాక్షినగర్ ప్రాంతం చలపతినగర్‌లోకి తరుచూ కణుజులు వచ్చి ఇంటి పెరట్లో ఉండే నీటి కుండీలలో నీరు తాగి వెళుతుండేవి. ఈ నేపథ్యంలో ఓ కనుజు నీరు తాగిన అనంతరం తిరిగి కొండపైకి వెళ్లలేక వీధిలోనే మరణించింది.



ఇటీవల సీతకొండ దిగువున మృతి చెందిన కణుజు మృతదేహాన్ని దహనం చేస్తున్న అటవీ సిబ్బంది

- వీటితో పాటు జాతీయరహదారిపై విశాఖవ్యాలీ స్కూల్ నుంచి ఎండాడ వరకు కంబాలకొండ నుంచి కిందకు దిగుతూ పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయాయి.
- **వేసవిలో బయటకు వస్తున్న వన్యప్రాణులు**

వేసవి కాలంలో ఎక్కువ సంఖ్యలో కంబాలకొండలు, సీత కొండ నుంచి వన్యప్రాణులు జనారణ్యంలోకి చేరుతున్నాయి. నీటి కోసం ఎక్కువగా ఇవి బయటకు వస్తుంటాయని అటవీ అధికారులే భావిస్తున్నారు. ఆయా కొండల అంచున నీటి కుండీలు ఏర్పాటు చేసి వాటికి రోజూ నీటిని సరఫరా చేస్తే వాటి మరణాలకు అడ్డుకట్టపడుతుందని వన్యప్రాణి ప్రేమికులు కోరుతున్నారు. దీంతో పాటు కొండలు నుంచి కిందకు దిగి రోడ్లుపైకి రాకుండా వెంటనే కంచె నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వైభవంగా సామూహిక వేంకటేశ్వరస్వామి వ్రతం



వ్రతంలో పాల్గొన్న దంపతులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్కులో శ్రీ శక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీ సౌందర్యలహరి ప్రవచన మహోత్సవాల్లో భాగంగా శనివారం సామూహిక శ్రీ వేంకటేశ్వరస్వామి వ్రతాన్ని నిర్వహించారు. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ పర్యవేక్షణలో ఈ ప్రవచన మహోత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జరిగిన వ్రతంలో శనివారం 250 మంది దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం సాయంత్రంతో ఈ మహోత్సవాలు ముగియనున్నాయి. ఈ కార్యక్రమంలో ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్ దంపతులతో పాటు శ్రీవారి సేవా బృందం కో–ఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరాజు, వంశీక్లాత్ షోరూం అధినేతలు భాస్కరరావు, అప్పారావు, శివ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి



దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని పురస్కరించుకొని నగర బీజేపీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించాయి. నగర పార్టీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. తొలుత పార్టీ శ్రేణులు ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ దేశసేవను జీవన విధానంగా మార్చుకున్న మహోన్నత వ్యక్తి దీనదయాళ్ ఉపాధ్యాయ అన్నారు. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మరణం అనంతరం జనసంఘ్ నామరూపాలు లేకుండా పోతుందని ఆశించిన వారి అనుమానాలను పటాపంచలు చేస్తూ పార్టీని దేశవ్యాప్తంగా బలోపేతం చేసిన మహనీయుడిగా దీన్‌దయాల్ ఉపాధ్యాయ చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పార్టీ సేవలను కొనసాగించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తూర్పు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు వీరే..

ఆరిలోవ : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అధిష్టానం మరిన్ని చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా నియోజకవర్గాల వారీగా కన్వీనర్లు, కో కన్వీనర్లు, వార్డుల కన్వీనర్లను నియమించింది. విశాఖ తూర్పు నియోజకవర్గంలో ఓ కన్వీనరు, నలుగురు కో కన్వీనర్లతో పాటు ప్రతి వార్డుల్లో ఒక్కొక్కరు చొప్పున వార్డు సోషల్ మీడియా కన్వీనర్లను నియమించారు. వారంతా పార్టీ అధిష్టానం సూచనలను పార్టీ కార్యకర్తలకు తెలయజేస్తుంటారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తుంటారు.

- **నియోజకవర్గం కన్వీనర్లు వీరే..**

నియోజకవర్గం కన్వీనర్‌గా గరికిన వెంకట్, కో కన్వీనర్లగా బంగారు భవానీ శంకర్, గరికన రాధా కృష్ణ, కిలాని రామప్రసాద్, పొన్నాడ విష్ణువర్ధన్

వార్డు కన్వీనర్లు

- జీవీఎంసీ 9వ వార్డుకు ఎస్.దుర్గారావు, 10వ వార్డుకు ఎం. చంద్రశేఖర్, 11వ వార్డుకు దామోదర ఈశ్వరరావు, 12వ వార్డుకు గంధం మనోజ్ చైతన్య, 13వ వార్డు కు రెడ్డి సత్తిరాజు, 15వ వార్డుకు పి.మహిధర్, 16వ వార్డుకు కె.సుబ్రహ్మణ్యేశ్వ రరావు, 17వ వార్డుకు గేదెల శ్రీనివాస్, 18వ వార్డుకు కేతా శ్రీనివాస్, 19వ వార్డుకు ఉమ్మడి గోపి, 20వ వార్డుకు కాగితాల మహేష్ రెడ్డి, 21వ వార్డుకు ఈగల మోహన్ సాయిని నియమించారు. 22వ వార్డుకు సుగ్గ శ్రీను, 23వ వార్డుకు బెవర వెంకట శివకుమార్, 28వ వార్డుకు రాంబాబును నియమించారు.

ఘనంగా షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



విద్యుత్‌దీపాలతో అలంకరించిన షిర్డీ సాయిబాబా ఆలయం..

ఆరిలోవ: చినగదిలిలో నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం పదో వార్షికోత్సవం శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయంలో సాయిబాబాను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని ఘనంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా ఇక్కడ కమిటీ సభ్యులు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయానికి అలంకరించిన విద్యుత్ దీపాలు భక్తులను ఆకట్టుకొంటున్నాయి. మూడు రోజులు పాటు జరగనున్న ఈ ఉత్సవాలలో భాగంగా శనివారం ఉదయం నుంచి షిర్డీ సాయిబాబాకు పూజలు చేశారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించారు. సాయంత్రం వాయిద్యాలు, భజనలతో బాబా రథాన్ని పురవీధులలో ఊరేగించారు. ఆదివారం ఉదయం 6 గంటలు నుంచి సాయంత్రం 6 గంటలు వరకు ఏకాహం, ఓం సాయి, శ్రీసాయి, జైజై సాయి అనే మాల మంత్ర ఉచ్చారణ జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు తెలిపారు.

తెలుగుభాష సదస్సు వెబ్‌సైట్ ఆవిష్కరణ



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం తెలుగు శాఖ, సమైక్య భారతి సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21, 22తేదీల్లో అంతర్జాతీయ తెలుగు భాషా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన వెబ్‌సైట్ www.telugu.in ను ఏయూ ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సమావేశాల రూపకర్త డాక్టర్ మూర్తి రేమళ్ల ఇస్రో శాస్త్రవేత్త మార్గదర్శనంలో ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థులతో తయారు చేసిన ఈ వెబ్‌సైట్‌లో సమావేశాలకు సంబంధించిన అన్ని వివరాలను ఒకే చోట నిక్షిప్తం చేస్తున్నారు. ఇంకా ప్రత్యక్షంగా పాల్గొనలేని వారికి ప్రత్యక్ష ప్రసారం లింక్ కూడా దీనిలో ఉంచడం జరుగుతోంది. రెండు రోజులు జరిగే సమావేశాలలో 12 సదస్సులు 70 మంది వక్తలు, ఆచార్యులు పరిశోధకులు వివిధ దేశాల మాతృభాషా ప్రేమికులు, సాహితీవేత్తలు పాల్గొంటారు. టీఎల్ఎన్ సభామందిరం వేదికగా ఈ సమావేశాలు జరుగుతాయి. శ్రీ మల్లిక్ పుచ్చా (అమెరికా) ఆధ్వర్యంలో ప్రత్యేక సమాంతర సభా మందిరంలో భాగవత ఆణిముత్యాల కార్యక్రమం నిర్వహిస్తారు. సమైక్య భారతి జాతీయ గౌరవాధ్యక్షుడు రేమళ్ల మూర్తి, సమైక్య భారతి సమన్వయకర్త కన్నయ్య, ఆంధ్ర విశ్వ కళా పరిషత్ తెలుగు శాఖ ఆచార్యులు అయ్యగారి సీతారత్నం పాల్గొన్నారు.

డాక్‌యార్డ్‌లో ఉద్యోగి మృతి

మల్కాపురం: డాక్‌యార్డులో విధులకు వెళ్లిన ఓ ఉద్యోగి విద్యుత్ షాక్ కారణంగా మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... జీవీఎంసీ 58వ వార్డు పరిధి రామ్‌నగర్ ప్రాంతంలో ఒడరేవుల కుమార్‌స్వామి (35) భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నారు. నేవల్ డాక్‌యార్డ్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే శనివారం ఉదయం ఫస్ట్ షిఫ్టుకు డ్యూటీకి వెళ్లాడు. అనంతరం 8.15 గంటల సమయంలో డాక్‌యార్డ్‌లోని డాక్ వద్ద గల ఓ నౌక దిగువవ కుమార్ స్వామి నీటిలో మునిగి ఉన్నట్టు ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సహచర ఉద్యోగులు గుర్తించారు. వెంటనే వారు ఉన్నతాధికారులకు సమాచారమివ్వడంతో కుమార్ స్వామిని ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టుగా వైద్యులు నిర్ధారించారు. వెంటనే అధికారులు మల్కాపురం పోలీసులకు, మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రికి వెళ్లి ఘటనపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం : ప్రతిభ గల తెలుగువారిని గుర్తించి వారికి ఉగాది రోజున పురస్కారాలు అందజేయనున్నట్టు అంతర్జాతీయ ఈవెంట్ డైరెక్టర్ వీరుమామ పేర్కొన్నారు. విద్య, వైద్యం, సేవ, నృత్యం, కళలు, సినిమా, సంగీతం, టీవీ, క్రీడలు, విశిష్ట సేవ, యువపురస్కారాలు, ప్రత్యేక జ్యూరీ పురస్కారాలు అందివ్వనున్నామన్నారు. నామినేషన్ల కోసం 70137 35330 నంబర్‌కు పూర్తి వివరాలు మార్చి 15లోగా పంపాలని వీరుమామ తెలిపారు. వయస్సుతో సంబంధం లేకుండా ఎవరైనా ఉగాది పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

దళితులపై టీడీపీది కపట ప్రేమ

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలోని దళితులపై టీడీపీ కపట ప్రేమ చూపిస్తోందని దళిత నాయకుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వి.జె.అజయ్ కుమార్ అన్నారు. టీడీపీ హయాంలోనే దళితుల అభ్యున్నతి సాధ్యమైందని లోకేష్ తన పాదయాత్రలో చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. దళితుల విషయంపై లోకేష్ చేసిన కామెంట్లను ఖండిస్తూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ ప్రభుత్వంలో దళితులను అంతం చేయాలని చూశారని ఎంతో మందిపై దాడులు చేశారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి దళితులకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు.

గంజాయి కేసులో ఏయూ సెక్యూరిటీ గార్డుల అరెస్టు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): మూడో పట్టణ పరిధిలో గంజాయి కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి బీచ్‌రోడ్డులో అక్రమంగా గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఏయూలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న చంద్రమౌళి, అప్పలరాజు, సురేష్ వద్ద అక్రమంగా 500 గ్రాములు గంజాయిని గుర్తించారు. ఈ ముగ్గుర్ని అరెస్ట్ చేసి శనివారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సింహాచలం భూ సమస్యను పరిష్కరించాలి



విజయసాయిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బోణి శివరామకృష్ణ

బీచ్‌రోడ్డు: సింహాచలం దేవస్థానం భూముల్లో నివాసం ఉంటున్న పేద ప్రజలకు పట్టాలు మంజూరు చేసి ఆ సమస్యను పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ పార్టీ నేత, పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ విజయసాయి రెడ్డిని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు బోణి శివ రామకృష్ణ కోరారు. ఈ మేరకు నగరానికి వచ్చిన విజయ సాయిరెడ్డిని శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. సింహాచలం భూముల్లో ఎక్కువ మంది దళితులు, బడుగు, బలహీన వర్గలకు చెందిన ప్రజలే నివాసం ఉంటున్నారని వారందరికీ న్యాయం చేయాలని కోరారు. దీనిపై విజయ సాయిరెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఘంటసాల ఓపెన్ ఆడిటోరియం నిర్మించాలి



గంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

బీచ్‌రోడ్డు: తన గాన మాధుర్యంతో కోట్లాది తెలుగు ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం పొందిన అమర గాయకుడు ఘంటసాల విగ్రహం వద్ద ఓపెన్ ఆడిటోరియం నిర్మించాలని ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమల రావు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఘంటసాల 49వ వర్ధంతి సందర్భంగా బీచ్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల గాయకుడిగా, నిర్మాతగా, సంగీత దర్శకుడిగా గానే కాకుండా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష కూడా అనుభవించిన దేశ భక్తుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు జీవీ రామచంద్రరావు, ఎల్ఐసీ డీవో బొమ్మిడి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు రవికుమార్, సన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల ఆరాధకులు ఆధ్వర్యంలో..

ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఘంటసాల అరాధకులు గ్రూప్ సభ్యులు బీచ్‌రోడ్డులోని ఘంటసాల విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రహమతుల్లా, పి.సోమశేఖర్, సామినేని శివప్రసాద్, ఢిల్లేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీల సమస్యల పరిష్కారానికి వినతి



మంత్రికి బొకే అందజేస్తున్న బీసీ సంఘాల నాయకులు

ఎంవీపీకాలనీ: బీసీ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కేంద్ర సామాజిక, న్యాయ సాధికారత మంత్రి రాందాస్ అథవాలేను బీసీ సంఘాలు కోరారు. ఈ మేరకు ఢిల్లీలోని ఆంధ్రభవన్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందజేసినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోను బీసీ కుల గణన చేపట్టాల్సిన అవసరముందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకొనే విధంగా కృషి చేయాలని మంత్రి రాందాస్ అథవాలేని కోరినట్లు తెలిపారు. దీంతో పాటు బీసీ క్రిమిలేయర్‌ను రద్దుచేయడం, సుప్రీం కోర్టులో ఎస్సీ, ఎస్టీ, బీసీ న్యాయమూర్తుల నియామకానికి రిజర్వేషన్లు అమలు చేయడం వంటి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని మంత్రిని కోరినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం కన్వీనర్ డాక్టర్ కొయ్యే ఆనంద్ రత్న కుమార్, రాష్ట్ర బీసీ యూత్ కార్యదర్శి డాక్టర్ మామిడి వేణుగోపాల్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తల్లి ఫ్లైఓవర్‌పై రక్షణ చర్యలు



ప్రమాద స్థలంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



మృతుల ఫొటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్

అల్లిపురం : తెలుగు తల్లి ఫ్లైఓవర్‌పై తరచు జరుగుతున్న ప్రమాదాల నివారణకు నగర పోలీసులు చర్యలు చేపట్టారు. ఫ్లైఓవర్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సుమారు 10 నుంచి 12 మంది వరకు దుర్మరణం చెందారు. ట్రాఫిక్ ఏడీసీపీ ఆరీఫుల్లా, జోన్–1, ఏసీపీ కుమారస్వామి, జోన్–2 ఏసీపీ శరత్ కుమార్, ఈస్ట్ వన్ సీఐ సూరినాయుడు, ఈస్ట్–2 సీఐ షణ్ముఖరావు, జీవీఎంసీ, ఆర్ అండ్ బీ అధికారులు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి కారణాలు విశ్లేషించారు. అనంతరం ప్రమాద ప్రాంతం వద్ద గ్లోసైన్ బోర్డులు, ప్రమాదంలో మృతి చెందిన వారి ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అదే విధంగా ఒక కానిస్టేబుల్‌ను బీట్ డ్యూటీకి ఏర్పాటు చేసి వాహన చోదకులను అప్రమత్తం చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.